# 7. మా హైస్కూలు

మా హైస్కూలంటే నేను చదివిందన్నమాట. ఆ హైస్కూల్లో - బాగుపడ దల్చుకొన్నవా డెవడూ జేరడు. మఱి నువ్వెట్లా చదివావయ్యా అంటారేమో - ఆ మహా పట్టణానికి అది ఒక్కటే హైస్కూలు. చదువు వచ్చినా రాకపోయినా సరే దాంట్లోనే చదవి తీరాలి. కాబట్టి నాకు తప్పనిసరయిందని విన్నవిస్తున్నాను.

ఆ హైస్కూలు - దాన్ని గరల్స్ స్కూలనాలో, బాయిస్ స్కూలనాలో నాకు తెలియదు. ఏమంటే ఒక్కొక ఫారంలో డజన్లు, స్కోరులమంది గరల్సున్నారు. టోపీల నామ సంవత్సరంనాడు శంఖుస్థాపన కాబడ్డా, చదువులో మాత్రం ఏమీ అభివృద్ధి అవలేదు. పిల్లలకేం - చాలామంది; కొత్త తెలుగు టాకీకి మొదటిరోజున వచ్చినంతమందనుకోండి!

ఇంక ఆ స్కూల్లో చదివే రకాల్ని చూద్దాం. అంతా మేజర్లే. కొంతమంది సర్టిఫికేట్లులాగిన బాపతుకూడాను. రౌడీలకు లెక్కే లేదు. చదివేది లేకపోయినా - గుఱ్ఱం గుడ్డిదైనా దాణాకు తక్కువలేదుగా!-నీటుగా అంతా సినిమా యాక్టర్లలాగు మేకప్‌తో తయారయ్యేవాళ్లు. పొడిచేసేట్టుగా తొమ్మిదింటికే స్కూలుకు వచ్చి మఱ్ఱిచెట్టుక్రింద బిఛాణా పరచి, డక్కస్ సిగరెట్లు ఒకదానివెంట ఒకటి పీల్చేసేవాళ్ళు. ఒక్కొకప్పుడు కిందటిరోజు కాల్చి దాచన బాపతు సెకండు హ్యాండూ, థర్డుహ్యాండూకూడా కాలుస్తూ హస్కాలజీ కొట్టేవాళ్ళు. ఇదేమిరా అంటే "Second hand cigarettes make the man pure and perfect" అంటారు. ఇంతముందుగా వీళ్ళీ అంటిండెన్సు యివ్వటం ఎందుకంటే-వచ్చే వనితా సమూహాన్ని ఆహ్వానించేందుకు.

ఆ గరల్స్ మాత్రం సామాన్యులా? వీళ్ళ బాబులు వాళ్ళు, వాళ్ళబాబులు వీళ్ళు. వాళ్ళుకూడా, వీరొచ్చిన పావుగంటకల్లా, ఒకళ్ళ తరువాత ఒకళ్ళు బాగా తయారై, అరంగుళం మందాన ఫేసుపౌడరద్ది, లోలక్కులు కదిలేట్టు సున్నితంగా తల ఆడిస్తూ, చెమట పొయ్యకపోయినా జేబురుమాలుతో తుడుచుకుంటూ, మూతి మూడు వంకర్లు త్రిప్పుకుంటూ ఒకటేమిటి, వెయ్యాల్సిన వేషాలన్నీ వేస్తూ చిరునవ్వు ఒలకబోసుకుంటూ, ఘల్లుఘల్లుమని వస్తుంటే-మనవాళ్ళు మెల్లిగా తమ స్థానాలనుంచి లేచి, ఇకలింపులు, సకిలింపులు చేసేవాళ్లు. తమకు సైకిలుందని చూపేందుకు, దానిమీద ఎక్కబోయి డభేలుమని పడి, చెయ్యి బెణికినా దెబ్బతగలనట్టు నటించే వాళ్ళూ, తమకు రిష్టువాచి వుందని చూపేందుకు దానివంక మాటిమాటికి చూచేవాళ్ళు. వాళ్ళతో మాట్లాడబోయి భయపడి మానేసేవాళ్ళు. ఈ రకంగా...

పిట్ట తరువాత పిట్ట గూటిని జేరినట్టు ఒక్కొక్కళ్ళే క్లాసులోకి ప్రవేశించేవాళ్ళు. గరల్సును ఏడిపించటం అంటే వీళ్ళకో పెద్దసరదా! ఈ విషయంలో కొంతమంది కమిటీ-వీళ్ళకో లీడరు. అట్టహాసం- ఈ కమిటీ అంతా ముందరే వచ్చి, బోర్డుమీద, గోడలమీద, బెంచీలమీద, గరల్సుకు పెట్టని పేర్లన్నీ వ్రాసేవాళ్ళు. మరికొంతమంది రొమాన్సు రాయుళ్ళు - అందరూ రావులేలెండి-ఈ రావులకు యేమీ రావని వేఱే చెప్పాలా?-తమ ప్రియురాళ్ళకు (వీళ్ల దృష్టిలో మాత్రమే!) బహుమానాల్ని తెచ్చేవాళ్ళు, నోట్సు ఒద్దన్నా ఇచ్చేవాళ్ళు; ప్రేమలేఖలు పారాసేవాళ్ళు, లవ్ పిక్చెర్సు ఇచ్చేవాళ్ళు-ఈ జట్టొకటి. ఇట్టి వివిధ తరహాలతో విరాజిల్లుతూండేది ఆ హైస్కూలు!

గంతకు తగ్గ బొంతన్నట్టు ఈ హైస్కూలుకు తగ్గ స్టాఫే అంతాను. చెప్పే చదువు వాళ్ళకే అర్థంకాదు. ఇంక పిల్లలకేం అర్థమవుతుంది? వీళ్ళుకూడా గరల్సంటే పడిచచ్చే వాళ్ళు. వాళ్ళ యెదుట ఏ కుర్రాడైనా దబాయిస్తే, వాడ్ని తమాయించటం చేతకాక క్లాసురూము విడిచిపెట్టి మైలు రేసు చేసేవాళ్ళు.

క్లాసులో పాఠం సాగుతేనా? - ఇందాక చెప్పిన కమిటీ మెంబర్లు తలోమూలా జేరేవాళ్ళు. పిచ్చిపిచ్చి మాటలు-అంటే ఆ మాష్టరుకు గరల్సుకు వున్న పేళ్ళన్నీ ఒకదాని తరువాత ఒకటి, సహస్రనామాల్లాగు వలిస్తూ ఉండేవాళ్లు. ఈ ఉపాధ్యాయుల్లో కొందరి క్లాసులు ఎల్లాగుంటాయో చూడండి.

లెక్కల మాష్టరు, యంగ్ యల్.టి.నున్నటి క్రాపుతో ఠీక్‌గా టెక్సు, లేకుండా వచ్చేవాడు. పుస్తకాలు గరల్సు దగ్గర మాత్రమే (Boys are strictly prohibited అన్నట్టు) తీసుకునేవాడు. ఎందుకంటే ఆ పుస్తకాల్లో మన రొమాన్సురాయుళ్ల లౌ లెటర్సు (పొరపాటున పెట్టినవి దొరుకుతూ వుంటాయి-కోలారులో గోల్డులాగు. అవి తీసి దాయటం వీరి ఉద్యోగం.

ఇంకోక్లాసు–ఇది తెలుగుక్లాసు. ఆచార్లవారు ఆదరణగా మాట్లాడినా ఆయన్ను అదరకొట్టేట్టు మాట్లాడేవాళ్లు కుర్రాళ్ళు. పాపం ఇంగ్లీషురాదు ఆయనకు. అటెండెన్సు మానిటర్ చేత వేయించేవాడు. అందరికీ ప్రజంట్లేనాయెను! వీరు ఎప్పుడూ మడికట్టుకున్నట్లు స్వచ్ఛమైన తెలుగుమాత్రమే మాట్లాడేవారు. జపానువారి ధర్మాన కానీకి మూడురకం బుడగలు (పిల్లలు ఊదుకొనేవి) అమ్మకాని కొచ్చాయి. బయట సిగరెట్ పొగంతా ఈట్యూబుల్లోకి ఎక్కించటం, క్లాసులోకి వచ్చి అదంతా వదలడం; ఆచార్లవారు మార్జాలంలాగు ఆఘ్రాణించి, "ఎవరురా! ఎక్కడనుండియో ధూమము గదినంతయు నాక్రమించు చున్నది. దుర్భరము! దుస్సహము!" అంటూంటే ఒకడొకమూల లేచి, "ఇది ధూమము కాదు గురువర్యా! మీ నాసికా గహ్వరమునుండి వెలువడు మదరాసు అంబాళ్ నస్యపు సువాసన" అనేవాడు. ఈ క్లాసులో మొక్కజొన్న కండెలు తినేవాళ్లూ, కిరసనాయిలతో శుభ్రముగా తయారు కాబడిన పునుగులు, జంతికలు ఇత్యాది చిరుతిండ్లు తినేవాళ్లూ, గరల్సుమీద సిరాలు చల్లేవాళ్ళూ, గైరమ్మ దినపాటలు, ఘరంమసాలా పాటలు పాడేవాళ్లు–అంతా ఏ రైల్వేస్టేషన్‌లాగో వుండేది.

ఇంకో హిస్టరీ మాష్టరు. పాపం నత్తి. దాన్ని కప్పెయ్యాలన్నా సాధ్యంకాదు. 'పోపుగ్రిగరీ' అనబోయి "పో...పో...పోపు...గిర గిర" అనేవాడు.

మఱో కుంటిసైన్సు మాస్టరు. ముసలివాడయినా కనబడకుండా మీసాలకు నల్లరంగువేసి (తారు అనుకుంటా) ఎనిమిదింటికే ఇంటి దగ్గర బయలుదేరి వస్తూ, "కుంటికులాసం ఇంటికి మోసం" అని కేకలు వేసే కుర్రాళ్ళను ఎగాదిగా చూచుకుంటూ, మెల్లిగా మీటరుగేజి గూడ్సులాగా పదింటికి స్కూలుకు జేరేవాడు. ఇంగ్లీషు మాట్లాడాలని ప్రయత్నించేవాడు, కాని అన్నీ బూతులే! ఎవడయినా లేటుగావస్తే, "కమింగ్‌లేట్ – సిటింగ్ బ్యాక్ బెంచెస్..డిస్టర్బింగ్ ది క్లాస్..." అంటుంటే, ఇంకో మూలనుంచి, తాన అంటే తందాన అన్నట్టు, ఒక కుర్రాడు, "బ్లాకింక్ మీసమ్స్, స్టార్టింగ్ ఎయిట్ ఓ క్లాక్, చేరింగ్ టెన్‌ఓక్లాక్" అనేవాడు.

ఇంతటి స్కూలుకు హెడ్‌మాష్టర్ని కూడా చూపిస్తా. ఈయనొక తమిళ మనిషి. సాంబారంటే, వినాయకుడికి ఉండ్రాళ్ళలాగు, మహాప్రీతి. ఎవడయినా ఓగ్యాలను సాంబారిస్తే వాడు ప్యాసే! మొదట్లో తెలుగు రాకపోవడంచేత, కుర్రాళ్ళు తెలుగులో తిడుతే, గ్రహించుకోలేక 'సైలెన్స్' అనేవాడు. ఈయన రాసే నోట్సు, ఛండాలంగా వున్నాసరే కొన్నవాళ్ళకు సెలక్షన్ పరీక్షతో పనేలేదు. స్కూల్ ఫైనల్ క్లాసులోని (అందరూ రెండు పుష్కరాల్ని, అరడజను పబ్లిక్ పరీక్షల్నీ చూచినబాపతు) ఆజానుబాహుల్ని చూస్తే ఠార్‌గా వుండే దీయనకు. ఇంగ్లీషు పొయట్రీ చెప్పేవాడు. వినేదెవరు? ఆ క్లాసుకయినా సరిగ్గా వచ్చేవాడు కాదు. ఏమయ్యా అంటే చాలా బిజీగా వున్నాననేవాడు. శనాదివారాలు ప్రైవేటు క్లాసులు–ఒకళ్ళిద్దరితోనే! ఈయన క్లాసులన్నీ గుడ్డిదర్బారే!

ఒకసారి రైటరు లంచాలు తీసికొని, మార్కులు దిద్దుతే, చూడకుండా దస్కతుపెట్టేసి, అధికార్లనుండి మాటవస్తే క్షమాపణ పత్రాలతో తప్పుకున్నాడు. ఈ రైటరుమాత్రం తక్కువవాడా? అప్పు చేసైనాసరే పప్పుకూడు తినాలనే బాపతు. వసూలుచేసిన డబ్బులో ముప్పాతికభాగం ఇంటి ఖర్చులకు ఉంచుకునేవాడు. ఒకటి రెండుసార్లు గోదావరీ స్నానంకూడా చేశాట్ట.

సెలక్షన్స్ లేకుండా వుండాలనీ – ఆ రూలుకు ఒప్పుకోకపోతే, అయ్యరు ఇంటిని పరశురామప్రీతిచేస్తామనీ ఆకాశరామన్న ఉత్తరం రాస్తే, అయ్యరు ఔరఘుళ్ లంచాలతో దాచిపెట్టిన అరవై వేలూ ఆహుతవుతయ్యని, అదిరి, అందర్నీ పరీక్షకు పొమ్మన్నాడు. కొంచెం బాగా దబాయిస్తే పరీక్ష ఫీజుకూడా తనే కట్టుకునేవాడేమో!

ఇంక ఈ స్కూలు బిల్డింగ్సు చూద్దాం. క్లాసుల్లో ఎప్పుడు బూజు, గోడనుంచి పెద్దపెద్ద సున్నపు పెళ్ళలు పడుతూవుండేవి. స్కూలుకో గంట; అది ఇప్పుడో ఇంకాసేపటికో విరిగి నెత్తిన పడుతుందేమో అన్నట్టుగా వుంటుంది. స్కూలు సమప్రదేశంలో కాకుండా, ఎగుడు దిగుళ్ళ భూమిమీద వుంటుంది; హంపీ శిధిలాలూ, అజంతా గుహలూ జ్ఞాపకానికొస్తాయ్. –ఈ స్కూలును చూస్తే ఏదైనా ఫ్యాక్టరీయా అనిపిస్తుంది. ఇలాంటి జపాను స్కూళ్ళు మీ వూళ్ళోకూడా ఉన్నాయా?